కథా నిలయం
శ్రీకాకుళం

# నేను... నేనే...

డబ్బు దాచుకోండి లేదా ఋణమన్నా తీసుకోండి.... అని రెండింటిలో యేదో ఒక పనికి ప్రేరేపించే, నినాదాలూ, పోస్టర్లూ.... అక్కడి గోడల నిండా ! ఓ మోస్తరు భవంతిలో, మోతాదు మించిన కస్టమర్లతో, ఆ గ్రామీణా బ్యాంక్ శాఖ రద్దీగా వుంది. వారి – రెండు నినాదానాలను, పాటించ (నోట్ల) కంకణం కట్టుకున్న వారిలా, జనం – అక్కడి బీరువాలూ, కంప్యూటర్లూ, వోచర్లూ, లెడ్జర్లూ రకరకాల పరికరాలలో పరికరాల్లా... యెవరి తొందరలో వాళ్లు....

మానవుల ఆర్థిక సంబంధ బాంధవ్యాలకు – వొక వాహికగా వెలిసిన బ్యాంక్ – ఆర్థికమే కీలకంగా మారిపోయి; మానవ బాంధవ్యమేదో మాసిపోయినట్టు... గోలగోలగా వుంది.

అద్దాల ఛాంబర్‌లో మేనేజర్ మేడమ్‌గారు – కంప్యూటర్‌లో కాసేపు యేవేవో ఫైళ్ళు కెలికి రీజనల్ ఆఫీస్ వారు నిన్ననడిగిన గణాంక వివరాల తయారీలో వున్నారు. కాసేపు ఫోన్ రాకుండా వుంటే బాగుండు అనుకున్నారు. మళ్లీ అంతలోనే – యే ఫోన్? రీజనల్ ఆఫీస్ ఫోనా ? శైలూ నుంచి ఫోనా ? యేది ? అని ప్రశ్నించుకున్నారు.

బడ్జెట్ టార్గెట్స్ ఫుల్‌ఫిల్ కాలేదు, ప్లాన్ ఆఫ్ యాక్షన్ వుండాలంటారు – రీజనల్ ఆఫీస్ వారు! స్టేటిస్టిక్స్ అడుగుతారు.

ప్లాన్‌డ్‌గా వెళ్తా వున్నాం, మమ్మీ, బట్ హి యీజ్ బ్రేకింగ్ అంటుంది శైలూ.

ప్లాన్ ఆఫ్ యాక్షన్సన్నీ, అనుకున్నట్టే జరిగిపోతాయా తల్లీ? అనుకుంటాం, ప్రయత్నిస్తాం, కానీ జరగకపోవచ్చు. సర్దుకుపోవాలి, అదే జీవితం – కూతురికి చెప్పగలిగేను, కానీ రీజనల్ ఆఫీసుకి అలా చెప్పగలనా...? నిట్టూర్చేరు మేడమ్.

"...అయితే యేం చెయ్యమంటావు ?"

"...నమ్మాలి తల్లీ. నమ్మకం బట్టే వుంటుంది"

"నమ్మితేనే గదా – యెవరన్నా మోసం చేయగలరు."

"... భర్త గదా... తల్లీ"

"...ఔను గానీ; యిది ఆస్తి గదా..."

కూతురితో ఫోన సంభాషణ – యెన్నిసార్లో గుర్తుకొచ్చి, ఆస్తి దగ్గర ఆగిపోతోంది. మేడమ్‌కేమీ పాలుబోవటం లేదు. అంతిమ సారాంశంలో – అన్నీ ఆస్తి సంబంధాలే అమ్మాయీ అని కరుణ హాస్యమాడుతోందనుకునేదాన్ని... అని నిశ్వాసం వదిలేరు.

"మేడమ్, మీకు ఫోనట... మీ ఛాంబర్లోని ఫోన్ పలకడంలేదని, అక్కవుంటెంట్ గారి ఫోన్‌కి చేసారట యెవరో"... వచ్చి చెప్పాడు మెసెంజర్.

మేడమ్ గారు, ఎక్కడివక్కడ వదిలేసి, ఫోన్‌కోసం వెళ్లేరు. కానీ, రిసీవర్ అందుకొని హలో అనగానే అదీ కట్ అయ్యింది. ఫోన్ పెట్టేసి అలా నిల్చున్నారు. మళ్ళీ రింగ్‌కోసం.

కస్టమర్లు కొందరు – నమస్తే మేడమ్, నమస్కారం మేడమ్, మార్నింగ్ మేడమ్ – మేడమ్, మేడమ్, నమస్కారాలు...

అపుడాక్షణాన, ఆమె యెందుకో – నాపేరేంటి – అని గుర్తుకు తెచ్చుకోసాగింది. అందరూ మేడమనే పిలుస్తారు. కూతురు ఫోన్ చేసినా – మేడమ్‌గారున్నారా–అనడుగు తుందట ! భర్త – యెలాగూ యజమాని పిలుపే ! సంతకాలు పెట్టినప్పుడూ, పేరు గుర్తుకు రాదు. ఇల్లెజిబుల్‌గా యింగ్లీషులో గీకటమే.

తెలుగులో సంతకం చేస్తే తప్పా ? సంతకం – స్వంత వ్యక్తిత్వానికి గుర్తు. నీ యింగ్లీషు సంతకం లాగే – నువ్వు యిల్లెజిబుల్ అయిపోతావే అమ్మాయీ – కరుణ స్నేహ పూర్వక హెచ్చరిక గుర్తొకొచ్చింది.

"...నీ పేరేంటి ?"

కేష్ కౌంటర్‌కి యెదురుగా, ఆడా మగా గుంపు. ఆ గుంపులో ఓ స్త్రీ – కేషియర్ ప్రశ్నకు వోసారి కనురెప్పలాడించి తలదించి, నేల చూపులు చూస్తూ పులకలేదు... పలకలేదు... మళ్ళీ ప్రశ్నించేడు కేషియర్...

"...చౌందర్యా సార్..." స్త్రీ ప్రక్కనున్న ఆసామీ బదులిచ్చేడు.

"...యేం, ఆవిడ చెప్పలేదా ?"

"...చిగ్గు సార్... ఆడ లేడీస్ గదా, చిగ్గు..." నవ్వుతూ, ఆ మాత్రం గ్రహింపు లేదా తమకు, అన్నట్టు బదులిచ్చేడా ఆసామీ. ఛామనచాయ రంగులో పైజామా లాల్చీలో, పసుపురంగు మఫ్లర్ మెడలో కులాసాగా కన్పించుతున్నాడు. ప్రక్కనున్న స్త్రీ మాత్రం – అంత కులాసాగా లేదు. పేరుకి తగ్గ సౌందర్యమూ లేదు.

"...భర్త పేరు చెప్పు..." కోపంగా, కాస్త కంఠం పెంచి అడిగేడు కేషియర్. ఆమె మళ్ళీ వోసారి కేషియర్‌ని నిర్లిప్తంగా చూసి, కనురెప్పలు దపదపలాడించి, నేల చూపులు చూడసాగింది.

"...నరిసింహాండి సార్..." ప్రక్కనున్న ఆసామీయే బదులిచ్చేడు. ఈసారి కేషియర్‌కి, ఆసామీ మీద కోపమొచ్చి –

"...ఆవిడకి నోర్లెదా ? ఆవిణ్ణి అడిగితే, నువ్వు జవాబిస్తావేటి ? నువ్వెవడివి మధ్యలో...?" కేకలేశాడు.

ఆ కేకలకు, ఆ ఆసామీ కాసేపు వూరుకున్నాడు. బ్యాంక్‌లోని కస్టమర్లందరూ – యిటువైపే చూసేరు. మేడమ్ గారూ, కౌంటర్ వైపు రెండడుగులు వేసి, నిల్చుని గమనించసాగేరు.

కాసేపయ్యేక ఆ ఆసామీ, అక్కడున్న యావన్మందికీ సమాధానంగా ముందు వొక నవ్వు విసిరేడు. ఆ తర్వాత –

"...యెవులిమో అయితే, మధ్యలెందుకు దూరతాం ? దూరితే, యెవర్తయినా, యెందుకొప్పుకుంటాది ? ఆడ లేడిసేటి, అంత వీక్నెసోళ్లా ?" అని ప్రశ్నలు విసిరేడు.

అక్కడున్న స్త్రీ లందరూ – ప్రశంసంగా చూసారతని వేపు. ఆతర్వాత –

"...హజ్బెండ్లం గాబట్టే మధ్యల దూరినాం. పెళ్లాం తరుపున పెనిమిటి మాటాడ గూడదేటి ? తప్పేటి ? చెప్పండి?" అని ప్రశ్నలు మళ్ళీ విసిరేడు.

అందుకు, అక్కడున్న పురుషులందరూ – ప్రశంసంగా చూసారాయన్ని. కేషియర్ కోపాన్ని అణచుకొని చేసేదేమీ లేక పాస్‌బుక్‌లోని ఫోటోతో ఆ స్త్రీని సరిపోల్చుకొని – డబ్బు యిచ్చెయ్యబోయేడు.

"ఆగండి సార్... డబ్బివ్వకండి. ఈవిడ – ఆవిడ కాదు..." అంటూ మెసెంజర్, నొక ఓపెనింగ్ ఫారం తీసుకొస్తూ, కేక వేసి, ఆ ఓపెనింగ్ ఫారాన్ని మేడమ్ గారికిచ్చి చూడమన్నాడు.

మేడమ్‌గారు – ఓపెనింగ్ ఫారంలో ఫోటోనీ, ఆ స్త్రీనీ తరచి, తరచి చూసేరు. ఈ లోగా కేషియర్, తన దగ్గరి పాస్‌బుక్ తీసుకొచ్చి మేడమ్ గారికి చూపించేడు.

పాస్‌బుక్‌లో ఫోటోకూ, ఆ స్త్రీకీ సరిపోతోంది. కానీ ఎక్కడంటే, ఓపెనింగ్ ఫారంలో ఫోటోకి, యీమెకీ పోలికల్లేవు. ఓపెనింగ్ తేది చూస్తే, యేడాది కిందటిది. అయినా, యేడాది కాలానికే యింత మార్పు వస్తుందా ? రాదు ! యేదో మిస్చీఫ్...? ఆలోచిస్తూ

"నీ పేరంటమ్మాయ్ ?" అనడిగేరామెను.

"చౌందర్యాండి మేడం, చెప్పేను గదండి సార్..." ఆసామీయే బదులిచ్చేడు.

"నువ్వు మాటాడకు అవిణ్ణి మాటాడనీ..." కసిరేరు మేడమ్ గారు.

"...అలగే, అలగలగే.. ఆవిడే మాటాడ్తాది. మాటాడలేదేటి ? మాటాడ్తాది" అని మేడమ్ గారికీ, ఆ తర్వాత, భార్యతో –

"...చెప్పు, చెప్పు. నీ నేమ్ అడిగితే – చౌందర్యా అనీ, హజ్బెండ్ నేమ్ అడిగితే – నరసింహా అనీ చెప్పు. చెప్పలేవేటే...?" అనన్నాడు.

ఆ ఆసామీ, మాటలాడే ముందూ, మాటల తర్వాతా – సన్నగా నవ్వేడు. అలా నవ్వేవారంటే – అనుమానమే మేడమ్ గారికి.

ఏం జరిగింది? ఈమో యెవరు ? ఎక్కవుంట్ ఓపెనింగ్ ఫారంలో ఫోటో యెవరిది? ఆలోచనలు మేడమ్ గారి మస్తిష్కంలో.

బలహీనవర్గాల వారికి – ఇండ్ల నిర్మాణం కోసం ధన సహాయం అందిస్తుంది – హౌసింగ్ బోర్డ్. గ్రామస్థాయి పెద్ద మనుషుల నుండీ, ఎమ్మెల్యే వంటి నాయకుల దాకా– లబ్ధిదార్ల ఎంపికలో లాబీయింగ్ వుంటుంది. ఎట్టకేలకు, ఎంపికైన లబ్ధిదార్లను – బ్యాంకులో ఖాతాలను ఓపెన్ చేయమని లిస్ట్ ప్రకటిస్తుంది హౌసింగ్ బోర్డ్. లబ్ధిదార్లు – ఖాతాలు ఓపెన్ చేస్తారు. ఆ తర్వాత హౌసింగ్ బోర్డ్ – లబ్ధిదార్లకు యిండ్ల పునాదుల నుండి ఆరంభించి, పూర్తయ్యే దాకా దశల వారీ ధన సహాయం బ్యాంక్ ద్వారా అందిస్తుంది. అయితే, యీ సహాయం అందించటానికి – వొక్కోసారి నెలలూ, సంవత్సరాలు పడ్తాయి. ఈ గ్రామం వారికీ – అలాంటి గడువే గడిచింది.

అంచేత, యీ మధ్య కాలంలో – యేదో జరిగివుంటుంది.' అది యేవిటి – ఆలోచనల్లోంచి మేడమ్‌గారు తేరుకొని –

"... నిజం చెప్పు, యీ ఫోటో యెవరిది ? నువ్వెవరు? లేనిపోని గొడవల్లో యిరుక్కోగలవు. నిజం చెప్పు..." అని బెదిరించేరు.

అప్పటికీ, ఆ స్త్రీ కనురెప్పలాడించింది తప్పా, నోరు విప్పలేదు. అంతలో, అక్కడి మనుషుల్ని వొసిలించుకు, ముందుకొకామె వచ్చి –

"...నాది మేడమ్. ఆ ఫోటో నాది, ఆ మనిషిని నేను..." అని చెప్పింది, ఆకుపచ్చ వాయిల్ చీరలో, చురుగ్గా, యెగుర వేసిన పతాకలా వుందామె.

మేడమ్‌గారు ఆశ్చర్యంగా చూసేరు. ఓపెనింగ్ ఫారంలో ఫోటోకూ, ఆమెకూ సరిపోల్చుకున్నారు. ధృవీకరణ కోసం పేరడిగేరు. సౌందర్య అని చెప్పిందామె. అప్పుడు, భర్త పేరు అడిగేరు మేడమ్ గారు.

"...యెందుకు మేడమ్ ?"

బోధ పడలేదు. మళ్ళీ అడిగేరు, భర్త పేరమ్మా – అని.

"...అదే యెందుకూ...?"

మేడమ్ గారికి – శైలూ ప్రశ్నలా విన్పించింది.

"...ఎవరి పేరన వున్నా ఆస్తి యిద్దరిదేను అవుతుంది తల్లీ."

"..ఓకే. సో, నా పేర్న వుంటే, ఆయనకేం నష్టం?"

"...నష్టమనే కాదు, అలవాటుగా వొస్తొన్న..."

"...అదే, యెందుకు ? నాట్ వోన్లీ నేమ్ సేక్, యింకేదో వుంది...... అదే... యేఁవిటి?"

శైలుకే కాదు, మేడమ్ గారికీ అదేదో తెలీటం లేదు.

ఇపుడీమె... ప్రశ్నిస్తోంది?

* * *

"బుద్ధిలేని గవర్మెంటు గానీ – పద్దుకు మాలిన పద్ధతులేటివోయ్ ? అద్ధో(ధ్వా)నం రూలుసేటి వోయ్ ? బుద్ధిలేని గవర్నమెంటు గానీ – ఆడదాని పేర్న పట్టాలేటివోయ్...?" విసుక్కున్నాడు నారాయుడు.

విద్యా కమిటీ ప్రెసిడెంటుగా పోటీ చెయ్యబోతే – నలుగురు పిల్లల తండ్రి గనక – అనర్హుడని రూల్సు ప్రకారం తేల్చేసారు. అపుడు, ఇష్టం లేకపోయినా – యెదురింటి బంగారునాయుడ్ని నిల్చోబెట్టి గెలిపించేడు. అప్పట్నించీ, గవర్నమెంటు రూల్సు, రెగ్యులేషన్సు, చట్టాలూ, శాసనాలూ పద్దకు మాలినవిగా కన్పించసాగేయి నారాయుడికి!

నారాయుడికి, సదా కృతజ్ఞుడై మెలిగే బంగారు నాయుడు, నారాయుడి మాటల్ని తలవూపి ఆమోదిస్తూ –

"...గుడ్డి నంజి కూతురోయ్, గవర్మెంటు..." అని తేల్చాడు. ఆ మాటతో, సంతృప్తిగా చుట్ట వెలిగించేడు నారాయుడు.

వొచ్చినప్పట్నించే, వీరిద్దర్నీ గమనిస్తోన్న – చీమల గుంపస్వామి చిరాగ్గా, జేబులో చుట్టతీసి, కొసవేపు చిన్న పిసరు కొరికి, ఊసేసి –

"...సాల్లేర్రా... సాల్చు. ఆపేయండి. బండీ, బక్కలు (పశువులు) మొయ్యలేవు మీ మాటల్ని. సాల్లెండి. గవర్నమెంటు నంజట. నంజ గుడ్డి అట. కళ్ల ముందర, అక్రమానం చేసీ పెద్ద మనిసిని మాత్రం – యేటీ తీరవా అనడగలేరు, గానీ కనబడని గవర్నమెంటుని తిట్టి పోసేస్తారు..." అని, యీసడించేడు.

గుంప స్వామికి – గవర్నమెంటు అనేది గ్రామ పెద్దల నుంచీ కనబడుతుంది.

"ఉరుమురిమి, మంగళం మీద పడ్డట్టు – మామీద పడ్డావేటివోయ్, గుంప సోం...?" నవ్వుతూ అడిగేడు సర్పంచ్. మరి నాలుగైదు నెలల్లో ఎన్నికలున్నాయి గదా – సౌమ్యాన్ని ప్రదర్శించేడు.

గ్రామ సర్పంచూ, వార్డు మెంబర్లు ముగ్గురూ, వాటర్ కమిటీ, విద్యా కమిటీ ప్రెసిడెంట్లూ, కులపెద్దా... పంచాయితీ కూర్చున్నారు. వారికి కొద్ది దూరంలో అరుగులు మీదా, గడపల్లోనా – మరి కొందరు, అటు సౌందర్య బంధు బలగం, యిటు నరసింహ బంధుబలగంవారూ కూచున్నారు.

"...ఓరి నాయన్లారా... వొకళ్ళాకలూ, వొకళ్ళాకలూ – అందరూ కలిసి గవర్నమెంటునీ– రోజాల్లా తిట్టికుందురులేయ్రా. ముందీ తగువు తేల్చర్రా..." అని విసుక్కున్నాడు. నర్సింహులుకి పెద తండ్రి.

హౌవసింగ్ కోలనీ డబ్బుని – సౌందర్యకూ యివ్వలేదు. సౌందర్య పేరుతో వొచ్చిన మరొకామెకూ యివ్వలేదు. బ్యాంక్‌వారు, పేమెంట్ ఆపేసారు. వివాదం గ్రామ పెద్దల ముందుకు వొచ్చింది.

సర్పంచ్ – యీ వివాద పరిష్కారం వలన రేపు జరగబోయే పంచాయితీ ఎన్నికల్లో తనకు నష్టం జరగకూడదు. యే వర్గంకీ వ్యతిరేక మవగూడదు. కర్ర విరగనీ, పాము చావని రీతిలో పంచాయితీ జరపాలని, మనసులో తీర్మానించుకుని, కూచున్నాడు.

వార్డు మెంబర్లూ, కమిటీల ప్రెసిడెంట్లూ – యెవడు యే తీర్పు చెప్తే ఆ తీర్పుని ఖండించాలని కొందరూ, సమర్ధించాలని కొందరూ, యెవరికి వారుగా నిర్ణయించుకుని కూచున్నారు.

కులపెద్ద – యిలాంటి సమస్య తన యిన్నేళ్ళ పెద్దరికంలో యెదురు కాలేదు. మొగుడూ పెళ్ళాలకి సఖ్యత లేదంటే, యిడాకులిచ్చేం. ఫలానీ ఆడమనిసి తప్పుడు తోవ తొక్కిందంటే– తప్పు గట్టించినాం. తల్లీ బిడ్డల్ని యిడదీసినాం. కాపరాల్ని కలిపినాం, యిడదీసినాం. గానీ యిదేటిది...?

యేటో? యీ మధ్య కాలాన, అన్నీ కొత్త ఆచారాలూ, కొత్త అలవాట్లూ, కొత్త కొత్త సమస్యలూ! యేది మంచో, యేది చెడ్డో యిడమర్సటం – మన వొశం గావటం లేదు... ప్చ్!

అయినా, యిడమరచి, తీరుపిచ్చేడిం యెంత సేపు...? గాని, నలుగురూ యేటను కుంటారు? ఎన్నాళ్లు, యింకా, యీ మట్టీ మీద వుండిపోతాను? పండిపోయిన ఆకుని...! కాటికి కాళ్లు చాచి వున్నోడిని.

రేపు, కాస్టం కాడ, కాల్తన్న నా కట్టెల్ని చూసి, నలుగురూ – ముదరోడు, కులానికి మూల వృక్షం లాగ నిలబడ్డాడురా. ఎన్నడెవుడి నోట – చెడ్డ అన్పించుకోలేదు. మంచినీ, చెడ్డనీ వొక్కలాగ చూసేడు. రాంవ్రుడ్నీ, రావణాసురుడ్నీ యిరువుర్నీ వొక్కలాగ మన్నించినాడు. ఏ వొకనాడు, యే వొకరికి, యే వంకా యెట్టలేదు. ఎవుళికిరా సాద్దెం(ధ్యం) – అనుకోవాలి. కులం మొత్తంల – ముదరోడికి సాటి మర్లేరు అనన్పించుకోవాల..! అది ముఖ్యం! తీరుపిచ్చేడం ముఖ్యం కాదు – అని బోధపరుచుకొని; పండిపోయిన గెడ్డాన్నీ, బుర్రనీ, చేతి వేళ్లతో సవరించుకోసాగేడు, మౌనంగా.

"... యే మొగుడి పేరు సెప్తాదండీ బేంకీల? కాలనీ కోసరం యీ మొగుడి పేరుకావాలా?" కాపరానికి మరొక మొగుడి మొలతాడు కావాలా? ఏటండీ భాగోతం? ఏటండీ అడగరేంవండీ?" అని పెద్దల్ని ప్రశ్నించేడు, నరసింహులు తరఫున బంధువొకాయన. భుజమ్మీది తువ్వాలు దులుపుతూ.

"...ఓరె బాబూ, అడుగుతార్లేరా, అడుగుతారు. ఏటడగాలో పెద్దలకి తెల్సు లేయఁర్రా... నువ్వు తువ్వాలు దులిపి వూగిపోకు. ఎద్దు యెగరక ముందర మువ్వలెగిర్నాయట... నీలాగే..." అని బదులిచ్చింది, సౌందర్య తరపు బంధువొకామె.

"... ఓలమ్మీ ఆడికి తెల్దులేయే. కోడి కూస్తే తెల్లారతాదో. కుక్కలరిస్తే తెల్లార్తాదో.. ఆడికి తెల్దు లేయే. కడుపు దుఃఖంకి అడిగిసినాడు పెద్దల్ని. ఆడి దుఃఖం ఆడిది. నీకూ, నాకూ... వుంతాదేటి ఆ దుఃఖం..." అనంది, నరసింహులు తరపు బంధువొకామె.

ఇరుపక్షాల బంధువులూ - వాదనలు, కేకలు.

కలిసి కాపురమున్ననాడు వొచ్చిన ఇల్లు గనక, కాపురమొదిలేసి వెళిపోయిన దానికి చెందదని నరశింహులు తరపు వారూ; పట్టా ఆవిడ పేరున వొచ్చింది గనక, ఆవిడకే చెందుతాదని, సౌందర్య తరపు వారూ !

"...మొన్న మునిసిపల్ ఛెయిర్మేన్ కుర్చీని, యిరు పార్టీలకీ చెరిసగం కాలం సర్దేసుకుని పాలించడంకి ఎగ్రిమెంటయినట్ల - యీళ్లకీ, కోలనీని అలాగ సర్దగలమేటో చూడర్రా..." హాస్యమాడేడు చీమల గుంపస్వామి.

సర్పంచ్, విసుక్కున్నాడు. కేకలాపండన్నాడు. ఈ దఫాకి యీ యిల్లుకి - యెవరో వొకరు రాజీ పడండి, వొచ్చే నెలలో మరోదఫా లబ్దిదార్ల ఎంపిక వుంది. అందులో, రాజీ పడిన వ్యక్తికి శాంక్షన్ చేయిస్తాను, నమ్మండన్నాడు. అందరూ మౌనంగా విన్నారు. సంశయంగా సర్పంచ్ వేపు చూసేరు, యిరుపక్షాల వారూ, కొద్ది సేపటి తర్వాత -

"...అయితే, యెవులు రాజీ పడాలో నువ్వే చెప్పు. సబబు గుండీ లాగ - నువ్వే చెప్పగలవు. మరో దఫా స్కీముకి, యెవుల్ని ఆగిపోమంతావో నువ్వే చెప్పు. నీ మాట జవదాటం...! జవదాటి నోళికి, నీ కాలి సెప్పుతోటి మర్యాదించు అఁ!" అనన్నాది, సౌందర్య తరపు బంధవొకామె.

ఆమె, రెండు డ్వాక్రా మహిళా గ్రూపులకు నాయకురాలు, గనక సర్పంచ్ యెక్కడ, ఓట్ల తూకం వేసి, అటు వేపు తూగి పోతాడోనని భావించిన నర్సింహులు బంధువొకాయన, మళ్లీ పేచీని మొదటికే తెచ్చే ఉద్దేశంతో -

"...కాదు గానీ, సర్పంచో; నువ్వు చెప్పి మీ - బేంకులో యే మొగుడి పేరు చెప్తాదండీ, ఆవిడ? బేంకుల - యే మొగుడి పేరుందండీ?" అనడిగేడు.

మళ్లా మొదటికొచ్చేర్రా - అని నవ్వుకున్నాడు చీమల గుంపస్వామి. మరి, యిది తేలేట్లు లేదని, కమిటీ ప్రెసిడెంట్లు, పోనీ అలా మండలాఫీసుకెళ్లినా, యే డీలర్నో, యేడ్పించుక తినొచ్చని, లేచారు కలిసికట్టుగా.

"...ఎందుకు చెప్పాల ? మొగుడి పేరు యెందుకు చెప్పాల ?" చాలా సేపటి నుంచీ, మౌనంగా బంధువుల మధ్య కూచున్న సౌందర్య ప్రశ్నించింది.

బుర్రలు గోక్కున్నారు. మొహామొహాలు చూసుకున్నారు - పంచాయితీకి కూచున్న పెద్దలంతా.

* * *

నమస్తే మేడం, మోర్నింగ్ మేడం, మేడం, నమస్తే, మేడం – సిబ్బంది, కస్టమర్లు చేరుతున్నారు. ఉదయం పదిగంటల వేళ. గదులన్నీ, ఊడ్చేసి, కేబిన్‌లోని మేడం గారికి టీ యిచ్చింది పోలమ్మ. టీ త్రాగుతూ, సౌందర్య విషయంలో జరిగిన పంచాయితీ గురించి అడిగేరు మేడమ్. జరిగినదంతా చెప్పింది పోలమ్మ.

"...అయితే, తిరిగి తిరిగీ మన దగ్గరికే వొస్తోందా తగువు ?" అనడిగేరు మేడమ్.

"...తగువు వొచ్చిందే మనకాడ ! సొమ్ము యిచ్చేసుంతే – తగువే లేదు గదా..." అంది పోలమ్మ.

మేడమ్ గారు ఆశ్చర్యంగా చూసేరు. గతుక్కుమన్నారు. సమస్య తన వలన సృష్టించ బడిందా...!?

"...అయితే, యేం చెయ్యమంటావు పోలమ్మా ?"

"...అదేటమ్మా నన్నుడగుతారు ? అమ్మోరొచ్చి, జన్నోడ్ని సలహా అడిగనట్ట..." అనంది పోలమ్మ.

అలవోకగా, సామెతలూ, జీవిత సత్యాలూ పలుకుతుంది పోలమ్మ. పోలమ్మ వేపు, మెచ్చుకోలుగా చూసింది మేడమ్.

అంతలో, బేంకులోకి అడుగు పెడ్తోన్న సౌందర్యను చూసింది, పోలమ్మ.

"...యేటి జేస్తావో, అదిగో, వొస్తంది..." అని చూపింది పోలమ్మ.

"...అదికాదు పోలమ్మా – పంచాయితీ జరిగింది, యేమీ తేల్చలేదు. అయినా, మీకు మహిళా సంగాల్లాంటివి వుంటాయి గదా, వాళ్లేమంటన్నారు?" అని ప్రశ్నించేరు మేడం గారు.

"...అమ్మా... మయిలా సంగాలివిగో, డ్వాక్రా కాంగ్రెస్, డ్వాక్రా, తెలుగు దేశం, డ్వాక్రా సంగాలు. పట్నాలినించి అపుడపుడెవులో, పెద్ద పెద్ద అమ్మలక్కలు వస్తారు. పెద్ద పెద్ద మాట్లాడి యెళిపోతారు ! ఎవుళమ్మా. ఆడదానికి దిక్కు?" అని ప్రశ్నార్థక జవాబు చెప్పింది పోలమ్మ.

ఈలోగా, సౌందర్య వొచ్చి నమస్కరించింది.

మేడమ్, సౌందర్యను చూడసాగింది. మళ్లీ వాయిల్ చీరే గానీ తెలుపూ, ఎరుపూ గళ్లతో ప్రత్యేకంగా కళ్లకు కన్పిస్తోంది.

సౌందర్య గురించీ, ఆమె వైవాహిక జీవితం గురించీ అడిగితే బావుణ్ణు – అనుకుంది మేడమ్. అప్పుడే, సౌందర్య –

"...మేడం మా అమ్మమ్మదీ వూరు. మా అమ్మమ్మ మీద యీ ఊరి కులదేవత ఆవహించీదట. నుదుటిమీద రూపాయిబిళ్లంత కుంకమబొట్టుతోటి, వొంకీలు వొంకీలు తిరిగి నడుం దాటిన కురులు తోటి, ఛామనఛాయ రంగుమీద – కట్టూ, బొట్టూ, వొంటి నిండా కండ తోటి, ముచ్చట గుండీదట. అమ్మమ్మ, యీదిలో నడిస్తే మొగోళ్లు వొంగొంగి, తొంగి తొంగి, చూసేవోరట. భూవీ పుట్రా కలిగి పులిసిపోయిన మోతుబరు నాయుళ్లు – పొలాల్లంటా, కళ్లాల్లంటా, సాలల్లాంటా మాటు గాసీ వోళట..." అని చెప్తూ, క్షణం సేపు ఆగింది సౌందర్య.

మేడం గారు – ఆశ్చర్యంగా వినసాగారు.

"...మా తాత – మా అమ్మమ్మని కాపు గాయ లేక సచ్చే చావయ్యే వోడట !" అని నవ్వింది. ఆ తర్వాత –

"...యెందుకమ్మా ?" అనడిగింది.

మేడమ్ గారికి బోధపడలేదు. ఆ మాత్రం బోధపడదా – బోధపడే వుంటుందని భావిస్తూ సౌందర్య కొనసాగించింది –

"...వొరసగా, మా అమ్మనీ, మా మామని – యేడాదిన్నరేసి తేడాలో కన్నాదట. మా తాత, ఆ సంతానాన్ని అనుమానంగా చూసేవోడట. నా కంటా, యీ వూరి కుల పెద్ద, ముదరోడు బాగా చెప్పగలడు. మా అమ్మమ్మ గురించి. ఆ కులపెద్దతోటీ – తప్పు బట్టేడట. మరా రోజుల్ల, దానికి యెవులు సెప్పారో, మరి, కులదేవతయి పోయింది. పసుపు నీళ్ల స్నానం, గుగ్గిలం ధూపం, కురులు విరబోసి, కులదేవత గొంతులో, ఊగిపోతూ రాగాలు దీసి, అందర్నీ అడల గొట్టేదట. అంతే.. ఇక్కడ్నించి అది కాటికి యెల్లేదాక – దాన్ని అనుమానించడంకి మొగుడు భయపడేవోడు, అనుబగించడానికి – మొగోడన్నోడు భయపడేవోడట..." అని నవ్వి, కాసేపాగింది. మేడమ్ గారికి – యింట్రస్టింగ్‌గా వుంది. సౌందర్య వేపే చూస్తూ, వినసాగింది.

"... మా చిన్నతనంలోనే అమ్మమ్మ, తాతా – యిద్దరూ కాటికెల్లి పోనారు. మా రాకా, పోకా తగ్గిపోయింది. కాలమూ మారిపోయింది. ఊరుగూడా – మండల కేంద్రమయ్యింది. ఆఫీసులు, బేంకులు, రోడ్లు, స్కూళ్ళు, ఆస్పత్రులు, పోలీస్టేషన్లు తోటి మేము యెదిగి పెద్దోళ్లమయినట్టే, ఊరూ యెదిగింది.

మా అమ్మకి – కన్నవారింటి మీదా, కన్నవారి ఊరిమీద మమకారం. మా మామ కొడుక్కి, నన్ను యిచ్చి పెళ్లి చేసింది. నర్సింహ – మా మామ కొడుకే..." అని నవ్వింది మళ్లీ.

ఇదంతా, చెప్తోన్న సౌందర్య – మబ్బుపొరలు, పొరలు చెదరగా, కన్పించే సూర్య బింబంలా – మేడమ్ గారికి కన్పించసాగింది.

"...మా అమ్మమ్మ అసలు పేరు సుందరి. పలకలేక, మా వోళ్లు సుందరమ్మ అనేవోళ్ళట. గాని తరవాత దేవత పేర్న, 'సందెమ్మ' అయ్యిందట దాని పేరు.

మా అమ్మమ్మ పేరునే – నాకు పెట్టేరు, సందెమ్మని కాదు – సుందరని. నా మొగుడు ఆ పేరుని – చౌందర్యా చేసేడు." అని నవ్వింది.

మేడమ్ గారికి గూడా నవ్వొచ్చింది.

"...సౌందర్యని, కొన్నాళ్లకి 'సందెమ్మ' అవమన్నాడు నా మొగుడు. పడక మంచమ్మీద చౌందర్యనీ, పదిమందిలో 'సందెమ్మ'నీ – నీనవనుపోరా... అని తిట్టి పోసేసేను..." అని నవ్వి, మాటలాపేసింది సౌందర్య.

మేడమ్‌గారు చూడసాగేరు, సౌందర్యేమి మాటాడలేదు. ఇంతకూ, నరసింహతో విడిపోయాక, యెలా వున్నావ్, యెవరితో వున్నావ్ లాంటి ఆరాల కోసం ప్రశ్నించబోయి, నాలుక్కరుసుకున్నారు మేడమ్ గారు.

అప్పటికి, యింకెన్నింటినో చెప్పాల్సి వుండి గూడా, అవన్నీ వొదిలేసి, మేడమ్ గారి కళ్లల్లోకి చూస్తూ –

"...ఔనమ్మ మేడం గారూ, మీ లాంటోళ్ళకి, యీ నౌకరీలుని, ఫలానా వారి భార్యగా యిస్తారా? మీ చదువునీ సామునీ చూసి, మిమ్మల్ని మిమ్ములుగా చూసిస్తారా?" అని ప్రశ్నించింది సౌందర్య.

మేడమ్ గారు బిక్కచచ్చిపోయేరు. ఏమీ తోచలేదు. అంతలో కూతురు శైలూ నుంచి– కొనబోయే హౌస్. శైలూ పేరనే రిజిష్టర్ చేయబోతున్నామని ఫోన్ అపుడు, మేడమ్ గారు –

"...నీ పేరుకి తోకగా వైఫ్ ఆఫ్ అని కూడా అవసరం లేదేమో చూడు..." అంటూ యింకేమేమో చెప్పసాగారు.

♦ సాహిత్య నేత్రం త్రైమాసపత్రిక (11వ సంచిక) ఏప్రిల్ – 2005 ♦